

## కల్తీ కనిపెట్టలేరు

వాహనదారులను కొందరు పెట్రో ఉత్పత్తుల డీలర్లు మోసం చేస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో కొన్ని చోట్ల కల్తీ ఇంధనాలు కలపడంతో పాటు కళ్లముందే కొలతల్లో బురిడీ కొట్టిస్తున్నారు. 8లో▸



## గోసంరక్షణ పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గోసంరక్షణ నిధి పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన జి.లక్ష్మారెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.



## టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం | : 1,633 అడుగులు |
| ప్రస్తుతం | : 1,602.21 |
| టీఎంసీల సామర్థ్యం | : 105.788 |
| ప్రస్తుతం | : 24.411 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 4,949 |
| ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 147 |

## న్యూస్‌రీల్

### మల్లన్న సేవలో సంగీత దర్శకుడు కీరవాణి



మల్లన్న సన్నిధిలో ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంగళవారం శ్రీశైలం చేరుకున్న కీరవాణి మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆయనతో పలువురు భక్తులు ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపారు.

### శ్రీశైలంలో 55.77 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 55.7729 టీఎంసీల నీరు నిల్వగా ఉంది. డ్యాం నీటిమట్టం 835.50 అడుగులకు చేరుకుంది. సోమవారం నుంచి మంగళవారం వరకు ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి 5,470 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు 5,388 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పాదన అనంతరం విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 0.768 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 1.669 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

### ట్రెజరీల్లో భారీగా బదిలీలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీతో పాటు కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీలో ఫెవికాల్ వీరులకు స్థానచలనం కలిగింది. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా సీనియర్ అకౌంటెంట్లు, జూనియర్ అకౌంటెంట్ల బదిలీలకు కర్నూలు, నంద్యాల జిల్లా ట్రెజరీ అధికారులతో కమిటీ ఏర్పాటైంది. కమిటీలోని అధికారుల ఏకాభిప్రాయంతో బదిలీల ప్రక్రియను చేపట్టింది. ఐదేళ్లు పైబడి ఒకే స్టేషన్‌లో పనిచేస్తున్న వారిని దాదాపుగా బదిలీ చేశారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల్లో ఆఫీసు బేరర్లుగా ఉంటూ ఒకేచోట 9 ఏళ్ల పైబడి పని చేస్తున్న వారినీ బదిలీ చేయడం గమనార్హం. 42 మంది సీనియర్ అకౌంటెంట్లు, 5గురు జూనియర్ అకౌంటెంట్లు బదిలీ అయ్యాయ. ఇటీవల 'సాక్షి' ట్రెజరీల్లో లంచావతారులు శీర్షికన కథనాన్ని ప్రచురించింది. ఈ నేపథ్యంలో కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని సమూలంగా ప్రక్షాళన చేసినట్లయింది. బదిలీ అయిన వారి స్థానాల్లో శ్రీవిద్య, ప్రవీణ్‌కుమార్, నిలోఫర్, సునీల్‌బాబు, అబ్దుల్ షెహరాజ్ బాషా, ఉషారాణి నియమితులయ్యారు.

### ఏపీ పీజీసెట్‌కు 86 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: ఏపీ పీజీసెట్-2025లో మంగళవారం జరిగిన పరీక్షలకు 86.28 శాతం హాజరు నమోదైంది. ఉమ్మడి కర్నూలు జిల్లా కేంద్రంలోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, దూపాడు సమీపంలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. సెషన్-1లో హుమానిటీస్ అండ్ సోషల్ సైన్స్, కామర్స్, జువాలజీ.. సెషన్-2లో కంప్యూటర్ సైన్స్, సెషన్-3లో ఎకనామిక్స్, లైఫ్‌సైన్స్ పరీక్షలు జరిగాయి. మొత్తం 831 మంది విద్యార్థుల్లో 717 మంది హాజరయ్యారు. అబ్జర్వర్లు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ రామలింగారెడ్డి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. బుధవారం సెషన్-1లో బాటనీ, మ్యాథమాటికల్ సైన్సెస్, సెషన్-2లో పొలిటికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, సెషన్-3లో కెమికల్ సైన్సెస్ పరీక్షలు జరగనున్నాయి.

### దుకాణాలకు వేలం వేయకపోతే చర్యలు



మున్సిపల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీ విశ్వనాథం

నందికొట్కూరు:మున్సిపల్ సాధారణ సమావేశంలో తీర్మానం చేసిన దుకాణాలకు వేలం వేయకపోతే చట్ట పరమైన చర్యలు తప్పవని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ విశ్వనాథం హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాలకు వేలం పాటలు పాడకుండా నిబంధనలు ఉల్లంఘించి ఇతరులకు అప్పగించినట్లు తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపై నీరు పారుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నా నిర్లక్ష్యం తగదన్నారు. అనంతరం కమిషనర్ బేబి, డీఈ నాసీర్, మేనేజర్ లత, టీపీఓ రంగస్వామి, ఏఈ దినేష్, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

### ఏకాకి అఖిల!

- దూరమైన కుటుంబ సభ్యులు, సన్నిహితులు
- ఎన్నికల ముందు విభేదాలున్నా కలసికట్టుగా ప్రచారం
- ఆ తర్వాత పూర్తిగా మారిన అఖిల వైఖరి
- పట్టించుకోని దొర్నిపాడు మాజీ ఎంపీపీ భూమా బ్రహ్మానందరెడ్డి, నారాయణరెడ్డి
- ఎన్నికల ముందు నుంచే అఖిలను విభేదించిన నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి
- భూమా ప్రధాన అనుచరుడు ఏవీ సుబ్బారెడ్డితోనూ అఖిల వైరం
- సొంత చెల్లెలు భూమా మౌనికారెడ్డితోనూ దూరం పెరిగినట్లు ప్రచారం
- భార్గవ్ వైఖరి, అఖిల అనాలోచిత నిర్ణయాలే కారణం
- ఇక రాజకీయంగా గడ్డుకాలమేనని పార్టీలో చర్చ

# బంధాలు కాదనుకొని.. వైరాలు కొనితెచ్చుకుని!

భూమా అఖిలప్రియకు కుటుంబ సభ్యులు పూర్తిగా దూరమయ్యారా? సన్నిహితులు ఆమె ఇంటికి వెళ్లాలన్నా విముఖత చూపుతున్నారా? అఖిల, ఆమె భర్త భార్గవ్ వైఖరి వారి రాజకీయ మనుగడను కూడా ప్రశ్నార్థకం చేస్తోందా? ఆళ్లగడ్డలో వీరి రాజకీయ ప్రస్థానం ముగియనుందా? టీడీపీ అధిష్టానం కూడా ఆళ్లగడ్డ వ్యవహారాలపై అసంతృప్తిగా ఉందా? కొద్దిరోజుల తర్వాత ప్రత్యామ్నాయ నాయకత్వం దిశగా పావులు కదుపుతోందా? తాజా పరిణామాలు నిశితంగా విశ్లేషిస్తే అవుననే సమాధానం వస్తోంది. ఆళ్లగడ్డలో అఖిలప్రియ వైఖరి, కుటుంబ సభ్యులు దూరమైన తీరు.. అవినీతి, అరాచక వ్యవహారాలపై అధిష్టానం నిర్ణయాలు తదితర అంశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

– సాక్షి ప్రతినిధి కర్నూలు



ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ

భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డి కుమార్తెగా అఖిల ప్రియ రాజకీయ అరంగేట్రం చేశారు. 2014 ఎన్నికల్లో శోభానాగిరెడ్డి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా నామినేషన్ దాఖలు చేసి ప్రచారం చేస్తున్న సమయంలో మరణించారు. ఆ తర్వాత ఆళ్లగడ్డ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా అఖిల ఎన్నికయ్యారు. అనంతరం నాగిరెడ్డి, అఖిల టీడీపీలో చేరారు. నాగిరెడ్డి అకాల మరణం తర్వాత అఖిల మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2019 తర్వాత ఆమె ఘోర ఓటమి చవి చూశారు. 2019-24 మధ్యలో అఖిల సన్నిహితులు, కుటుంసభ్యులు ఒక్కొక్కరుగా దూరమయ్యారు. మొదట 'భూమా' కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా, నాగిరెడ్డి ప్రాణస్నేహితుడిగా ఉన్న ఏవీ సుబ్బారెడ్డి అఖిలతో విభేదించారు. తనను చంపించేందుకు కొంతమందికి సుపారీ ఇచ్చారని అప్పట్లో సుబ్బారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. గోవిందపల్లి, చింతకుంటకు చెందిన కొందరిని కడప పోలీసులు అప్పట్లో అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారం తర్వాత అఖిల రాజకీయ అంతమే తన పంథమని సుబ్బారెడ్డి శపథం చేసి ఆమెకు వ్యతిరేకంగా పని చేస్తున్నారు. ఇప్పటి వరకూ రెండు కుటుంబాల మధ్య తీవ్ర స్థాయిలోనే విభేదాలు కొనసాగుతున్నాయి.

### ఆళ్లగడ్డ వ్యవహారాలపై అధిష్టానం గుట్టుగా విచారణ

ఈ ఏడాది కాలంలో అఖిల, భార్గవ్ వ్యవహారశైలి, నియోజకవర్గంలో పరిస్థితి, అవినీతి ఆరోపణలపై అధిష్టానం నివేదిక తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. ఓ బృందం ఆళ్లగడ్డ టౌన్, అహోబిలంలో పర్యటించినట్లు సమాచారం. అహోబిలంలో స్వామికి కొట్టే టెంకాయకు కూడా రూ.50-60 చొప్పున వ్యాపారులు తీసుకుంటున్నారు. చివరకు 2 లీటర్ల కూల్‌డ్రింక్ బాటిల్‌పైనా రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారు. తలనీలాలకు టెండర్ వేయకపోవడం, టోల్‌గేట్, దుకాణాల నుంచి వసూలు చేస్తున్న డబ్బులు, చికెన్ వ్యాపారులతో డబ్బులు తీసుకోవడం.. ఇలాంటి వ్యవహారాలన్నిటిపై టీడీపీ బృందం క్షేత్రస్థాయిలో విచారించి ఓ నివేదికను అధిష్టానానికి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నివేదిక ఆధారంగా పార్టీ పరువు పోతోందని, సరైన నిర్ణయం తీసుకోవాలనే యోచనలో పార్టీ ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

#### 'దేవర'తో బట్టబయలైన విభేదాలు

భూమా నాగిరెడ్డి చిన్నాన్న భూమా నారాయణరెడ్డి విజయ డెయిరీ చైర్మన్‌గా ఉండేవారు. ఆయన్ను తప్పించి జగత్‌విఖ్యాత్‌ను చైర్మన్‌గా చేసేందుకు ఎన్నికల ముందు అఖిల ప్రయత్నించారు. దీంతో నారాయణరెడ్డి రాజీనామా చేసి అఖిలకు దూరమయ్యారు. ఆయన కుమారుడు, దొర్నిపాడు మాజీ ఎంపీపీ భూమా బ్రహ్మానందరెడ్డి ఆ మండలంలో టీడీపీలో బలమైన నాయకుడు. వీరు అఖిలతో విభేదించారు. అయితే 2024 ఎన్నికల సమయంలో విభేదాలు పక్కనపెట్టి తిరిగి పని చేయాలని అఖిల రాజీ ప్రయత్నాలు చేశారు. దీంతో వీరు మొన్నటి ఎన్నికల్లో ఆమె కోసం పని చేశారు. ఫలితాల తర్వాత దొర్నిపాడు మండలంలోని పనులు, రాజకీయ వ్యవహారాలు తనకే అప్పగిస్తుందనే భావనలో బ్రహ్మానందరెడ్డి ఉన్నారు. అయితే ఆయన చేసిన పనులకు కూడా కమీషన్లు ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది. దీంతో చిన్నాన్న అయి ఉండి, ఎన్నికల్లో ఆమె కోసం ఖర్చు చేస్తే తనను కమీషన్‌లు అడగడం ఏంటని బ్రహ్మానందరెడ్డి దూరమయ్యారు. ఇతర నియోజకవర్గాల్లో కాంట్రాక్టులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల గోవిందిన్నెలో జరిగిన దేవరకు నారాయణరెడ్డి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లాలోని కీలకమైన టీడీపీ నేతలందరి ఫొటోలు ప్రింట్ చేశారు. అఖిల ఫొటోను ఒక్క ఫ్లెక్సీలో కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో అఖిలను తాము బహిష్కరించామని, విభేదిస్తున్నామని బ్రహ్మానందరెడ్డి ప్రజలకు బాహాటంగానే చెప్పినట్లయింది.

### 'భూమా' కుటుంబ సభ్యులు ఒక్కొక్కరుగా దూరం

- అఖిల పెదనాన్న భాస్కర్‌రెడ్డి కుమారుడు భూమా కిషోర్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో కొనసాగుతున్నారు.
- నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఎన్నికల ముందు నుంచి అఖిలకు దూరమయ్యారు. మొన్నటి ఎన్నికల్లో నంద్యాల టిక్కెట్ కూడా బ్రహ్మానికి దక్కలేదు. ఇతను కూడా వచ్చే ఎన్నికల్లో ఆళ్లగడ్డ నుంచి బరిలోకి దిగేందుకు యత్నిస్తున్నారు. ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇస్తే తీసుకుంటానని అధిష్టానికి సమాచారం అందించినట్లు తెలుస్తోంది.
- ఇదే క్రమంలో అఖిల చెల్లెలు, సినీ నటుడు మంచు మనోజ్ భార్య భూమా మౌనిక కూడా అఖిలకు దూరంగానే ఉన్నట్లు తెలుస్తోంది. రాజకీయంగా అవకాశం ఇస్తే ఆళ్లగడ్డ బరిలో తాను కూడా ఉంటానని ఇప్పటికే లోకేష్‌ను కలిసి మనోజ్ దంపతులు తమ అభిప్రాయాన్ని చెప్పినట్లు తెలుస్తోంది.
- అలాగే అఖిల సమీప బంధువు శివరామరెడ్డి కూడా దూరమయ్యారు. ఆయనకు చెందిన ఓ క్రషర్‌ను నాలుగేళ్ల కిందట స్వాధీనం చేసుకునేందుకు అఖిల ప్రయత్నించడమే అందుకు కారణంగా తెలుస్తోంది.

### భక్తులకు భారమవుతున్న 'బి'ట్యాక్స్!



అధికారికంగా నిర్ణయించిన టోలు ధరలు ఇలా..





అనధికారికంగా వసూలు ఇలా..

ఇది అహోబిలం గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన టోల్ వసూలు బోర్డు. ఇందులో నిర్ణయించిన మొత్తానికి, వసూలు చేస్తున్న మొత్తానికి పొంతన లేని పరిస్థితి. ఇక్కడి కాంట్రాక్టర్ రూ.150 వసూలు చేస్తూ ఇందుకోసం ప్రత్యేకంగా ముద్రించిన రశీదులు ఇస్తున్నారు. శ్రీశైల ఆలయంలోనూ ఇలాంటి పరిస్థితి లేకపోవడం, అక్కడ కూడా టోల్ రుసుము రూ.100కు మించి వసూలు చేయకపోవడం చూస్తే.. ఇక్కడ 'బి'ట్యాక్స్ భక్తులకు ఏ స్థాయిలో భారమవుతుందో అర్థమవుతోంది.

## తలసరి ఆదాయం పెంచేందుకు సహకరించండి

- కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో అధిక తలసరి ఆదాయం మహానంది మండలంలో ఉందని.. ఇదే తరహాలో అన్ని మండలాల్లో తలసరి ఆదాయం పెంచేలా బ్యాంకర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కమ్యూలేటివ్ కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరసింహరావు, ఎల్‌డీఎం రవీంద్ర కుమార్, పరిశ్రమల శాఖ జీఎం జవహర్ బాబు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, బ్యాంకుల ప్రతినిధులు తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి స్థూల దేశీయోత్పత్తిని పెంచడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లా స్థూల దేశీయోత్పత్తి 2024-25 కు రూ.43,630 కోట్ల మేరకు చేరిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26కు రూ.50,711 కోట్ల మేరకు పెంచేలా బ్యాంకర్లు సహాయ సహకారాలు అందజేయాలన్నారు. కౌలు రైతులకు పెద్దఎత్తున సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయడం ద్వారా వారికి రుణాలు లభిస్తాయన్నారు. పశుపోషకులను ప్రోత్సహించేందుకు ముందుకు రావాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం సూర్య ఘర్, పీఎం విశ్వకర్మ పథకాలకు బ్యాంకర్లు తప్పనిసరిగా చేయూత అందజేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 485 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అనంతరం 2025-26కు సంబంధించిన వార్షిక క్రెడిట్ ప్లాన్‌ను బ్యాంకర్లతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

## భక్తులకు మెరుగైన వసతులు కల్పించండి



అధికారులతో మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం శ్రీశైలంలోని దేవస్థాన పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో పలు పాలనాంశాలపై అధికారులతో ఈఓ సమీక్ష నిర్వహించారు. క్షేత్రాన్ని సందర్శించే భక్తులకు వసతి కల్పన, సౌకర్యవంతమైన దర్శనం ఏర్పాట్లు, అన్నప్రసాద వితరణ, క్షేత్ర పారిశుద్ధ్యం తదితర అంశాలకు సంబంధించి ఈఓ పలు సూచనలు చేశారు. భక్తుల రద్దీకిఅనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇంజినీరింగ్ విభాగం తగు ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. సమావేశంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పి.మురళీబాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు

- ఫోర్త్‌జోన్ పరిధిలో 16 మంది సీఐలకు స్థానచలనం

**ఉమ్మడి జిల్లాలో సీఐల బదిలీలు ఇలా..**

| పేరు | ప్రస్తుత స్టేషన్ | బదిలీ స్టేషన్ |
|---|---|---|
| డి.విశ్వేశ్వరరావు | ఎస్‌హెచ్‌ఓ, పత్తికొండ | పంచలింగాల చెక్‌పోస్టు |
| ఆర్.సువర్ణలత | పంచలింగాల చెక్‌పోస్టు | ఎస్‌హెచ్‌ఓ, పత్తికొండ |
| పి.వర్దనా దేవి | ఎస్‌హెచ్‌ఓ, బనగానపల్లె | జీఎంపీపీ, బనగానపల్లె |
| ఇ.మోహన్ రెడ్డి | జీఎంపీపీ, మడకశిర | ఎస్‌హెచ్‌ఓ, ఆత్మకూరు |
| వై.విజయకుమార్ | క్యాటిల్ ఫాం చెక్‌పోస్టు | ఎస్‌హెచ్‌ఓ, ఆళ్లగడ్డ |
| టి.ఎస్.ప్రసాదరావు | ఎస్‌హెచ్‌ఓ, మడకశిర | మాదవరం చెక్‌పోస్టు |
| డి.మునుస్వామి | ఓబులాపురం చెక్‌పోస్టు | పంచలింగాల చెక్‌పోస్టు |

కర్నూలు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నాలుగో జోన్ పరిధిలోని కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పనిచేస్తున్న 16 మంది సీఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నాటుసారా నిర్మూలనకు అమలు చేస్తున్న నవోదయం కార్యక్రమాన్ని పట్టించుకోకపోవడం, అవినీతి ఆరోపణలు, తనిఖీల్లో పట్టుబడిన మద్యాన్ని విక్రయించి సొమ్ము చేసుకోవడం, నమ్మిన బంటుల(హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్) ద్వారా సారా తయారీదారులు, మద్యం వ్యాపారుల నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారని కొంతమంది సీఐలపై ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో సీఐల బదిలీలు జరగడం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

- పత్తికొండ సీఐ విశ్వేశ్వరరావుపై ఆయన కింద పనిచేస్తున్న సిబ్బందే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తనిఖీల్లో పట్టుబడిన మద్యం అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నాడని కింది స్థాయి సిబ్బంది నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ స్టేషన్ పరిధిలో 18కి పైగా తండాలు ఉండగా.. సారా తయారీదారుల నుంచి భారీగా మామూళ్లు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని సమాచారం.
- హెడ్ కానిస్టేబుల్ ఎస్.సర్దార్ హుసేన్ దాదాపు 20 ఏళ్లుగా పత్తికొండ స్టేషన్‌లో పనిచేస్తూ మామూళ్ల కోసం బెదిరిస్తున్నాడని సారా తయారీదారులు స్వయంగా ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సర్దార్ హుసేన్‌ను ఆళ్లగడ్డ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది.
- అదే స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ జె.నాగరాజు (గుర్రం నాగరాజు)పై కూడా అనేక అవినీతి ఆరోపణలు ఉండటంతో ఎమ్మెల్యే సిఫారసు మేరకు పత్తికొండ నుంచి పంచలింగాల చెక్‌పోస్టుకు బదిలీ చేసినట్లు సమాచారం.
- బనగానపల్లె సీఐ వర్దనా దేవి కూడా నవోదయం కార్యక్రమం అమలును పట్టించుకోలేదన్న ఆరోపణలపై అక్కడి నుంచి తప్పించి కళ్యాణదుర్గంకు బదిలీ చేసినట్లు తెలిసింది.

### నూలు మిల్లు కలప తరలుతోంది

- 15 రోజులుగా గుట్టుగా తరలిస్తున్న వ్యక్తులు



లారీలోకి కలప లోడ్ చేస్తున్న దృశ్యం

పాణ్యం:కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారి పక్కన పాణ్యం సమీపంలోని నూలుమిల్లులో విలువైన కలప చెట్లను కొందరు వ్యక్తులు అపహరిస్తున్నారు. దాదాపు 40 ఏళ్లకు పైబడిన చెట్లను కొట్టేసి గుట్టుగా మాయం చేస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్న ఈ మిల్లులోని కలప తరలింపునకు అటు కోర్టు, ఇటు అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేవు. అయినా కొందరు వ్యక్తులు దర్జాగా లారీల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మిల్లులో కలప తరలిపోతుందని స్థానికులు జౌళిశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా దర్జాగా లారీలో తరలిస్తున్నారు. భారీ విస్తీర్ణంలో ఉన్న ఈ మిల్లులో ఉన్న కలప చెట్లు ఏపుగా పెరిగి అడవిని తలపించేది. ఈ భారీ చెట్లను కొందరు వ్యక్తులు కోత మిషన్ల సహాయంతో కొట్టేసి లారీ తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే 15 రోజులుగా పదుల సంఖ్యలో లారీల్లో కలపను మిల్లు నుంచి దాటించినట్లు తెలుస్తోంది. జౌళిశాఖ ఏడీ నాగరాజరావును వివరణ కోరగా.. నూలు మిల్లులో చెట్లను తొలగించేందుకు ఎలాంటి అనుమతి ఎవరికీ ఇవ్వలేదని, విచారించి చెట్లను తరలిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు.



చెట్లను నరికేసిన దృశ్యం

## మహిళలకు రక్షణ కల్పించడంలో 'కూటమి' విఫలం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు

నంద్యాల అర్బన్: రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న హత్యాచారాలు, అఘాయిత్యాలను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాతమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా విమర్శించారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు మంగళవారం పట్టణంలో శాంతియాత్ర ర్యాలీ నిర్వహించారు. అనంతరం బొమ్మలసత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినితి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల అనంతపురంలో గిరిజన విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటన దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోపే రాష్ట్రంలో ఎంతో మంది మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నా పాలకులు మొద్దునిద్ర వీడటం లేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి అనిత రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడి ప్రజా సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మహిళా నేతలు శశికళారెడ్డి, సునీతా, శోభారాణి, రాజేశ్వరి, అనురాధారెడ్డి, రాజ్యలక్ష్మి, సావిత్రమ్మ, శిరీష, అనూష, సుబ్బలక్ష్మి, శోభారాణి, జరీనా, సబీనా, తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్వోల బదిలీలను నిలిపేసిన ప్రభుత్వం

- సచివాలయాల రేషనలైజేషన్ తరువాతే చేపట్టాలని నిర్ణయం
- అలాంటప్పుడు దరఖాస్తులు ఎందుకు చేయించారంటున్న వీఆర్వోలు



కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం విలేజ్ రెవెన్యూ అధికారుల(వీఆర్వో)కు తీవ్ర నిరాశను మిగిల్చింది. బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పి మధ్యలో నిలుపుదల చేయడం పట్ల వీఆర్వోలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా సుమారు 200 మంది వీఆర్వోలు అందరి ఉద్యోగుల తరహాలోనే దరఖాస్తు చేసుకున్నారు. అయితే సచివాలయాల రేషనలైజేషన్ తరువాతే వీఆర్వోలను బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ఈక్రమంలో వీఆర్వోలు తమతో ఎందుకు బదిలీల కోసం దరఖాస్తు చేయించారని ప్రశ్నిస్తున్నారు. ఇదిలాఉంటే బదిలీల కోసం చాలా మంది వీఆర్వోలు తమకు అనువైన ప్రదేశం కోసం కూటమి నాయకులకు లంచాలు ఇచ్చి ప్రజాప్రతినిధులతో ఆఫర్ లెటర్లను తెచ్చుకున్నారు. ఈ క్రమంలో బదిలీల ప్రక్రియ నిలిచిపోవడంతో వీఆర్వోలు ప్రభుత్వ తీరుపై భగ్గుమంటున్నారు.

#### 37 మంది సీనియర్ అసిస్టెంట్ల బదిలీ

సాధారణ బదిలీల్లో భాగంగా రెవెన్యూ శాఖలో పని చేస్తున్న 37 మంది సీనియర్/ఆర్‌ఐలను బదిలీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జేసీ డాక్టర్ బి.నవ్య ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే రిలీవ్ కావాలని ఆదేశించారు.

#### బదిలీల కోసం సర్వేయర్ల ఎదురుచూపు

సాధారణ బదిలీల్లో భాగంగా అన్ని డిపార్టుమెంట్లలో బదిలీల ప్రక్రియ చకచకా జరిగిపోతుంది. అయితే సర్వే శాఖలో మాత్రం బదిలీల కోసం సర్వేయర్లు ఎదురు చూడాల్సి వస్తోంది. సర్వేయర్లను ఆ శాఖ కమిషనర్ బదిలీ చేయాల్సి ఉంది. బదిలీల గడువు 10వ తేదీతో ముగిసినా జాబితా విడుదల కాకపోవడంతో ఆందోళన నెలకొంది.

## క్లుప్తంగా

### టీడీపీ నేత హల్‌చల్

● రెవెన్యూ అధికారుల పట్ల అనుచిత ప్రవర్తన



కార్యాలయం బయట అధికారులను దూషిస్తున్న జగదుర్తి టీడీపీ నేత శ్రీధర్‌రెడ్డి

డోన్: అధికార పార్టీ నేతలంటూ టీడీపీ బరితెగించి వ్యవహరిస్తున్నారు. ఓ వైపు ప్రతిపక్ష పార్టీ నాయకులను వేధిస్తుండటం, మరో వైపు తమ పనులు చక్కబెట్టని అధికారులను సైతం బెదిరిస్తున్నారు. విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ అధికారుల పట్ల వ్యవహరిస్తున్న తీరు మండలంలో చర్చనీయాశంగా మారింది. దళితుడైన డోన్ మండల రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ సునిల్ రాజుపై మండలంలోని గోసానిపల్లె డీలర్, టీడీపీ రైతు సంఘం అధ్యక్షులు మల్లయ్య అనుచితంగా ప్రవర్తించి 24 గంటలు ముగియక ముందే మండలంలోని జగదుర్తి గ్రామ టీడీపీ నాయకులు శ్రీధర్ రెడ్డి కూడా చుక్కల భూమి ఫైల్ విషయంలో రెవెన్యూ కార్యాయలంలో హల్‌చల్ చేశారు. ఏడాది కాలమైనా తన ఫైల్ ఎందుకు కదలడం లేదని అధికారులపై చిందులు తొక్కారు. చుక్కల భూమి విషయం తమ పరిధిలో లేదని జిల్లా జేసీకి ఫైల్‌ను పంపినట్లు వారు ఎంత చెప్పినా కూడా వినిపించుకోకుండా వారిపట్ల అనుచితంగా ప్రవర్తించడం చర్చనీయాంశమైంది. ఇటీవల బదిలీపై వెళ్లిన తహసీల్దార్ నాగమణి విధులు నిర్వర్తించే సమయంలో ఆమెను ప్రశ్నించే ధైర్యం చేయలేని టీడీపీ నాయకులు ఆమె బదిలీ అయిన వెంటనే కిందిస్థాయి అధికారులను బెదిరిస్తుండటంతో ప్రజలు విస్తుపోతున్నారు. కార్యాలయం ఆవరణలో అధికారులను దూషించడంతో స్థానికులు అవాక్కయ్యారు.

### యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కర్నూలు (టౌన్): ప్రతి రోజు క్రమం తప్పకుండా యోగాసానాలు వేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో యోగాసన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ చాటే యోగా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంత రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరినీ ఆరోగ్యవంతులుగా చేసేందుకు ప్రధానమంత్రి మోదీ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యోగా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి, డాక్టర్ పద్మావతి, కృప, మునిస్వామి, నివేదిత పాల్గొన్నారు.





# కల్తీ కనిపెట్టలేరు.. మోసం పసిగట్టలేరు

● పెట్రోల్ బంకుల్లో యథేచ్ఛగా కల్తీ, కొలతల్లో మోసాలు
● కిరోసిన్ కలిపి విక్రయాలు
● అధికారుల తనిఖీలు తూతూమంత్రం
● కనీస సాకర్యాలు కరువు
● నష్టపోతున్న వాహనదారులు

➡ పట్టణంలోని విశ్వనగర్‌కు చెందిన వెంకటసుబ్బారావు బైక్‌పై రోజూ చుట్టుపక్కల గ్రామాలు తిరుగుతూ దుస్తుల వ్యాపారం చేస్తున్నాడు. ఇందుకు ప్రతి రోజూ 3 లీటర్ల పెట్రోల్ ఖర్చు అయ్యేది. స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకులో తన బైక్‌కు పెట్రోల్ వేయించుకొనేవాడు. గతంలో దాదాపు 130 కి.మీ పాటు బైక్ తిరిగేది. గత నాలుగు మాసాలుగా 3 లీటర్ల పెట్రోల్ 100 కిలో మీటర్ల దూరం కూడా వచ్చేది కాదు. కొలతల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు అనుమానంతో అధికారులతో ఫిర్యాదు చేయగా దాడి చేసి జరిమానా విధించారు.

➡ గడివేముల మండలానికి చెందిన దినకర్ పట్టణంలోని ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రతి రోజూ గడివేముల నుంచి నంద్యాలకు రావాలంటే లీటరు పెట్రోల్ దాకా ఖర్చు అవుతుంది. ఊరి బయట ఉన్న ఓ పెట్రోల్ బంక్‌లో ఒకే సారి రెండు మూడు లీటర్లు పెట్రోల్ వేయించుకొనే వాడు. బైక్ సైలెన్సర్ నుంచి పొగ, వాసన వస్తుండటంతో పెట్రోల్ బంక్ నిర్వాహకులను నిలదీశాడు. కల్తీ పెట్రోల్‌తో వాహనం పరికరాలు దెబ్బతిన్నట్లు బైక్ మెకానిక్ చెప్పడంతో విధిలేని పరిస్థితుల్లో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాడు.

నంద్యాల(అర్బన్): వాహనదారులను కొందరు పెట్రో ఉత్పత్తుల డీలర్లు మోసం చేస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో కొన్ని చోట్ల ఇతర కల్తీ ఇంధనాలు కలపడంతో పాటు యంత్రాల్లో మైక్రో చిప్‌లు అమర్చి వాహనదారులను బురిడీ కొట్టిస్తున్నారు. మానవ ప్రమేయ మోసాలకు అడ్డుకట్ట వేస్తూ ఎలక్ట్రానిక్, డిజిటల్ ఫిల్లింగ్ డిస్పెన్సరీ యూనిట్లు అందుబాటులోకి వచ్చినా.. నిర్వాహకులు సరికొత్త మోసాలకు తెగబడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో లీటర్ పెట్రోల్ రూ.109.98 కాగా డీజిల్ రూ.97కు పైగానే విక్రయిస్తున్నారు. పెట్రోల్ పంప్ బాయ్‌లు డీజిల్, పెట్రోల్‌ను దర్జాగా దోచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రిటైల్ షాపులతో కుమ్మక్కై డీలర్లు పెట్రోల్ కల్తీలతో వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఇలాంటి మోసాలు జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల జరుగుతున్నట్లు సమాచారం. అయితే అధికారులు దాడులు చేసి ఫైన్లు వేయడం మినహా లైసెన్స్‌లు రద్దు చేసిన సంఘటనలు కనిపించడం లేదు.

జిల్లాలో 188 పెట్రోల్ పంప్‌లు ఉన్నాయి. అందులో ఐఓసీ 54, హెచ్‌పీసీఎల్ 74, బీపీసీ 39, ఇతర కంపెనీలు 30 పంపులు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాది మార్చి నుండి ఇప్పటి వరకు 26 కేసులు నమోదు చేసి రూ.2.10 లక్షల అపరాధ రుసుం విధించారు. ప్రధానంగా పంపింగ్‌లో తేడాలు, ముద్ర వేయించుకోకపోవడం, కల్తీ పెట్రోల్ తదితర వాటిపై అధికారులు దాడులు నిర్వహించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పెట్రోల్ బంకుల నిర్వాహకులు చేతివాటాన్ని ప్రదర్శస్తున్నట్లు తెలుస్తోంది. డిజిటల్ ఫిల్లింగ్ డిస్పెన్సరీ యూనిట్లలో అడిషనల్ మైక్రో చిప్స్, రిమోట్ కంట్రోల్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్, ఇన్‌స్టెంట్ అప్లికేషన్ ఇన్‌స్టాలేషన్ తదితరాలను అమర్చి 'గప్ చిప్'గా ఇంధనాన్ని నొక్కేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డిస్‌ప్లేలో మీటర్ రీడింగ్ కరెక్ట్‌గానే చూపిస్తుండడంతో ఈ మోసాన్ని వినియోగదారులు పసి గట్టలేకపోతున్నారు. దీంతో చిప్ మాటున పెట్రోల్, డీజిల్ దోపిడీ యథేచ్ఛగా సాగిపోతోంది.

**దోపిడీ ఇలా...**

పెట్రోల్ బంకు వద్దకు చేరుకోగానే మనం కోరిన మొత్తానికి పంప్ బాయ్ కీ బోర్డుపై బటన్ నొక్కి మీటర్ రీడింగ్‌లో సున్నా చూపించి పెట్రోల్/డీజిల్ వేయడం పరిపాటి. అయితే మనం చెల్లించిన మొత్తానికి సరిపడ పెట్రోల్/ డీజిల్ ట్యాంక్‌లో పడిందనుకుంటే ప్రస్తుత కాలంలో పొరపాటవుతోంది. డిస్పెన్సరీ యూనిట్లకు ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ చిప్‌ల వల్ల ప్రతి లీటర్‌కు 100 మిల్లీ లీటర్ల పెట్రోల్, డీజిల్ తక్కువగా ట్యాంక్‌లో పడుతున్న విషయాన్ని వినియోగదారులు పసిగట్టలేకపోతున్నారు. దీంతో బంక్ నిర్వాహకుల మోసాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు డిస్పెన్సరీ యూనిట్‌ను వెంటనే ఆఫ్ చేసి ఆన్ చేస్తారు. ఈ చర్యతో మెజర్‌మెంట్ యూనిట్‌లో ఎలాంటి వ్యత్యాసం కనిపించదు.



పెట్రోల్ బంక్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

**బంకుల వైపు చూడని అధికారులు..**

ఇంధన బంకులను పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని వాహనదారులు వాపోతున్నారు. బంకులపై అధికారుల దృష్టి పెట్టకపోవడంతో నిర్వాహకులు వారికి ఇష్టమొచ్చినట్లుగా వ్యవహరిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ధరలు పెరిగినప్పుడు వెంటనే పెంచే నిర్వాహకులు ధరలు తగ్గినప్పుడు మాత్రం దాదాపు ఒక్కరోజు అంతా ధరలు తగ్గికపోవడం అంటే ఇది ముమ్మాటికీ వినియోగదారులను దోచుకోవడమేనని వాపోతున్నారు.

**మొక్కుబడిగా వసతులు..**

ఇంధనం కోసం బంక్‌లకు వచ్చే వాహన దారులకు తాగునీరు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స కిట్లు, అందుబాటులో ఉంచాలి. వాహనాలకు ఉచితంగా గాలిపట్టే మిషన్లు ఉండాలి. వాహనాల్లో పెట్రోల్ నింపే సమయంలో పెట్రోల్ పడితే సిబ్బంది శుభ్రం చేయాలి. పెట్రోల్ కొట్టే సిబ్బంది కూడా సెల్‌ఫోన్ మాట్లాడరాదు. అధిక శాతం బంకుల్లో పని చేసే సిబ్బందికి మాత్రమే ఉపయోగపడేలా కార్యాలయ గదుల్లో తాగునీరు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొన్ని బంకుల్లో మాత్రమే మరుగుదొడ్లు ఉన్నా అవి మహిళలకు, పురుషులకు ఉపయోగపడటం లేదు. కొన్ని చోట్ల మొక్కుబడిగా గాలి మిషన్లు ఉన్నా గాలి పట్టేవారే ఉండటం లేదు. ఇంధన నాణ్యత, ధర, బంకు వేళల్లో నిర్వాహకుడి ఫోన్‌నెంబరు, అత్యావసర సేవల వివరాలను బహిరంగంగా ప్రదర్శించాలి. కాని ఏ బంక్‌ల్లో ఈ సౌకర్యాలు కనిపించడం లేదు.

**వాహనదారులు అవగాహన పెంచుకోవాలి**



పెట్రోల్ పంపుల ద్వారా బైక్‌లకు ఇంధనం నింపే విషయంలో వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలి. రీడింగ్ బోర్డులో మొదట జీరో ఉందా లేదో పరిశీలించుకోవాలి. పెట్రోల్ వేయించుకున్న తర్వాత డ్రాప్స్ అయిపోయేంత వరకు గన్ వాహనం ట్యాంకులోనే ఉంచాలి. అజాగ్రత్తగా ఉంటే కొన్ని చోట్ల పంపింగ్‌కు మోసాలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయి. పంపింగ్‌లో ఎయిర్ పట్టుకున్నప్పుడు మాత్రమే ఇంధన సరఫరాలో తక్కువ పెట్రోల్ వస్తుంది.

– జిలానీ బాషా, అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ శాఖ, నంద్యాల

### ఏపీటీడీసీలో పలువురి బదిలీ

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) కర్నూలు డివిజన్‌లో పవులురు ఉద్యోగులకు స్థాన చలనం కలిగింది. కర్నూలు డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఫైనాన్స్ అసిస్టెంట్ మేనేజర్ సి.రామకృష్ణ విజయవాడ కార్పొరేట్ కార్యాలయానికి, కర్నూలు డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ మేనేజర్ కె.సువర్ణకుమారి ఓర్వకల్ హరిత రాక్ గార్డెన్‌కు బదిలీ అయ్యారు.

● కర్నూలు హరిత హోటల్ యూనిట్ మేనేజర్ బి.సతీష్‌కుమార్ విజయవాడ డివిజన్ సూర్యలంక హరిత బీచ్ రిసార్ట్స్ బదిలీ అయ్యారు.

● కర్నూలు డివిజన్ ఇంజినీరింగ్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ తమ్మిశెట్టి కుమార్ విజయవాడ డివిజన్ ఇంజినీరింగ్ సెక్షన్‌కు, కర్నూలు డివిజన్ బెలుం కేవ్స్ అసిస్టెంట్ మేనేజర్ కె.అమర్‌నాథ్ రెడ్డి నెల్లూరు డివిజన్ నెల్లూరు బోటింగ్ యూనిట్, కర్నూలు డివిజన్ బిల్లస్వర్గం కేవ్స్, వాల్మీకి కేవ్స్ జూనియర్ సూపర్‌వైజర్ కె. బ్రహ్మానందరెడ్డిని ఓర్వకల్ హరిత రాక్ గార్డెన్‌కు బదిలీ చేస్తూ ఏపీటీడీసీ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు.

### కుమారులకు పెళ్లి సంబంధాలు కుదరడం లేదని..

● తల్లి ఆత్మహత్య

అవుకు: కుమారులకు పెళ్లి సంబంధాలు కుదరడం లేదని మనస్తాపంతో ఓ తల్లి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అవుకులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కుమ్మరిదిడ్డి వీధికి చెందిన కాటికళ్ల లక్ష్మిదేవి (56)కి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు ఇద్దరికీ పెళ్లి సంబంధాలు కుదరక పోవడం, ఆమె ఆరోగ్య పరిస్థితి కూడా బాగోలేకపోవడంతో కొద్ది రోజులుగా ఆందోళన చెందుతోంది. ఈ క్రమంలో మనస్తాపంతో సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని రసాయన పౌడర్‌ను నీటిలో కలుపుకొని తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. కుటుంబీకులు గుర్తించి 108లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడు కరుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

## అనాథాశ్రమం నిర్వహణపై ఆగ్రహం

కర్నూలు(అర్బన్): నగరంలోని బుధవారపేటలో నిర్వహిస్తున్న సాయి అనాథాశ్రమం నిర్వహణ పట్ల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఎల్‌ఎస్‌యుఎం కమిటీ సభ్యులు, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్‌తో కలిసి అనాథాశ్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆశ్రమంలోని పిల్లలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. ఈ సందర్భంగా ఆయన ఆశ్రమాన్ని పరిశీలించి అపరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. రికార్డులు కూడా సక్రమంగా నిర్వహించడం లేదని, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకోలేదని సిబ్బందిని మందలించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, డిస్ట్రిక్ట్ ప్రొబేషనరీ ఆఫీసర్ పద్మ, రాయపాటి శ్రీనివాస్, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.




నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బి.లీలా వెంకటశేషాద్రి

**ఇందిరాగాంధీ నగర్‌లో..**

స్థానిక ఇందిరాగాంధీ నగర్‌లోని పట్టణ నిరాశ్రయుల వసతిగృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి తనిఖీ చేశారు. అక్కడి సౌకర్యాలు, పరిశుభ్రతను ఆయన పరిశీలించారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని వసతి గృహం నిర్వాహకురాలు శకుంతలను ఆదేశించారు.

### ముగిసిన మూల పెద్దమ్మ దేవర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, దర్శనానికి తరలివచ్చిన భక్తులు

దొర్నిపాడు: డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న మూలపెద్దమ్మ దేవర మంగళవారం ముగిసింది. చివరి రోజు అమ్మవారికి ఎల్లమ్మ పూజలు చేసి ముగించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. దేవరను విజయవంతం చేసిన భక్తులు, గ్రామస్తులకు ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య, మిద్దె చిన్నన్న, కంపమల్ల పెద్దన్న తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

### అటవీ శాఖలో బదిలీలు

కర్నూలు కల్చరల్: ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా అటవీశాఖలో పలువురు ఉద్యోగులకు స్థాన చలనం కలిగింది. కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ యశోదాబాయి, కర్నూలు డీఎఫ్‌వో శ్యామల వారివారి పరిధిలోని ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

➡ బనగానపల్లె సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జి.సుబ్బయ్యను కడప ఆఫీస్ ఆఫ్ ది ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా..

➡ రాయచోటి సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పి. నూర్జహాన్‌బీని పత్తికొండ సెక్షన్‌కు..

➡ కడప సోషల్ ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సి.నాగేశ్వరరావును చెలమ రేంజ్ పచ్చర్ల సెక్షన్‌కు..

➡ కర్నూలు సర్కిల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా సి.నాగేంద్ర వర కుమార్‌ను కడప ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో కార్యాలయానికి, అక్కడ విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఎస్.మహబుబ్ బాషాను కర్నూలు సర్కిల్ కార్యాలయానికి..

➡ నంద్యాల డివిజన్ సోషల్ ఫారెస్ట్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సి. విజయభాస్కర్‌రెడ్డిని ఆదోని రేంజ్ సెక్షన్‌కు..

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీవో)

| పేరు | ప్రస్తుతం | బదిలీ స్థానం |
|---|---|---|
| డి సునీత | జలదుర్గం | చింతలపేట |
| ప్రతాప్‌కుమార్ | తమ్మరాజుపల్లి | రామళ్ల కోట |
| జి.మహేష్ | రామతీర్థం | గని బీట్ |
| శకుంతలమ్మ | రామతీర్థం | జలదుర్గం |
| రేణుక | యాపర్లపాడు | గార్గేయపురం |
| జి.హనుకుమార్ | గని | తమ్మరాజుపల్లి |
| లక్ష్మిదేవిబాయి | యాపర్లపాడు | రామళ్ల కోట |
| వై.వెంకటరెడ్డి | బేతంచర్ల | గని |
| బి.జ్యోష్న | గూళ్యం | పాణ్యం |
| ఎ.నగేష్‌కుమార్ | గార్గేపురం | తుగభద్ర |

### వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఓర్వకల్లు: ఉప్పలపాడు గ్రామంలో ఓ వ్యక్తి తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల బజారు శ్రీనివాసులు(38) మండల కేంద్రమైన ఓర్వకల్లులో మోటర్ మెకానిక్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. తరచుగా మద్యం సేవించి భార్య రాములమ్మతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 8వ తేదీన మద్యం మత్తులో భార్యతో ఘర్షణపడి దాడి చేశాడు. దీంతో భర్త వేధింపులు తాళలేక ఆమె పుట్టినిల్లు బొల్లవరానికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాసులు మంగళవారం ఇంటివద్ద పురుగు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## వ్యవసాయ అనుబంధ శాఖల్లో బదిలీలు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ అనుబంధ శాఖల్లో భారీగా బదిలీలు చేపట్టారు. ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా కె.శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈయన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు వాసి. ఉద్యాన శాఖ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తూ కర్నూలు ఏపీఎంఐపీ పీడీగా బదిలీ అయ్యారు. ఇంత వరకు పీడీగా పనిచేసిన ఉమాదేవీ అనంతపురం జిల్లా ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో అదనపు పీడీగా పనిచేస్తున్న రాజాకృష్ణారెడ్డిని అనంతపురం మున్సిపాలిటీ ఉద్యాన శాఖ ఏడీగా బదిలీ చేశారు. ఈ స్థానంలో అనంతపురం ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో అదనపు పీడీగా పని చేస్తున్న ఫిరోజ్‌ఖాన్ నియమితులయ్యారు.

**జిల్లా పట్టు పరిశ్రమ అధికారిగా ఆంజనేయులు**

జిల్లా పట్టుపరిశ్రమ శాఖ సహాయ సంచాలకులుగా ఆంజనేయులు నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం అనంతపురంలో పని చేస్తున్నారు. మెడికల్ గ్రౌండ్స్ కింద బదిలీ అయినట్లు సమాచారం. ఇక్కడ పనిచేస్తున్న ఐ.విజయకుమార్‌ను అనంతపురం పట్టు పరిశ్రమ శాఖ అధికారిగా బదిలీ అయ్యారు. నంద్యాల జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారి పరమేశ్వరీ అనకాపల్లికి బదిలీ అయ్యారు. ఈ స్థానంలో ఆత్మకూరు ఏడీ నగేష్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

**జిల్లా సహకార అధికారిగా వెంకటకృష్ణ**

జిల్లా సహకార శాఖ అధికారిగా వెంకటకృష్ణ నియమితులయ్యారు. కాకినాడలో పనిచేస్తున్న ఈయన ను కర్నూలుకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో వివిధ హోదాల్లో ఇక్కడ పనిచేశారు. ఇంతవరకు కర్నూలు డీసీఓగా పనిచేసిన రామాంజనేయులు నంద్యాల డీసీఓగా బదిలీ అయ్యారు. నంద్యాల జిల్లా సహకార అధికారిగా పని చేస్తున్న వెంకటసుబ్బయ్య వైఎస్ఆర్ కడప డీసీఓగా బదిలీ అయ్యారు. జిల్లా సహకార ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న శిరీషను ఆదోని డివిజన్ సహకార అధికారిగా బదిలీ అయ్యారు.

**ఉద్యానశాఖలో..**

ఉద్యాన శాఖకు సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురు ఉద్యాన అధికారులు బదిలీ అయ్యారు. పత్తికొండలో ఉద్యాన అధికారిగా పని చేస్తున్న దస్తగిరిని ఆళ్లగడ్డకు, ఆదోనిలో ఉన్న బి.హరీంద్రను నంద్యాలకు, అవుకులో ఉన్న రఘువరన్‌ను ఆదోనికి, పాణ్యంలో ఉన్న దివ్యను అనంతపురం జిల్లా రాప్తాడుకు, కోవెలకుంట్లలో ఉన్న దరణిని డోన్‌కు, నంద్యాలలో ఉన్న శ్రీధర్‌ను కోవెలకుంట్లకు బదిలీ అయ్యారు. ఆళ్లగడ్డ హెచ్‌వోగా పనిచేస్తూ ఆన్‌డ్యూటీపై కర్నూలు హెచ్‌వోగా పనిచేస్తున్న నరేష్‌ను కర్నూలులో రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## వ్యవసాయ శాఖలో 45 మంది ఏఓల బదిలీ

**పైరవీలకు పెద్దపీట**

● ఆదోని ఏఓగా మరోసారి పాపిరెడ్డి
● కల్లూరు ఏఓగా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మిగనూరు ఏఓగా శివశంకర్

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖలో పైరవీలకు, కూటమి పార్టీ నేతలకు భారీగా ముడుపులు ముట్టచెప్పిన వారికి ఫోకల్ స్థానాలు లభించాయి. ఉమ్మడి జిల్లాలో 45 మంది వ్యవసాయ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆదోని మండల వ్యవసాయ అధికారిగా పాపిరెడ్డి నియమితులయ్యారు. ఈయన సరిగ్గా 20 నెలల క్రితం వరకు ఆదోని ఏవోగా 6ఏళ్ల పాటు పనిచేశారు. కేవలం 20 నెలల గ్యాప్‌తో మళ్లీ ఆదోని ఏఓగా నియమితులు కావడం వ్యవసాయ శాఖలో చర్చనీయాంశమైంది. కీలకమైన కల్లూరు ఏఓగా విష్ణువర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. ఆత్మకూరు నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. మరో ఫోకల్ మండలమైన ఎమ్మిగనూరు ఏఓగా శివశంకర్‌కు అవకాశం దక్కింది. ఇదివరకు హాలహర్వి ఏఓగా ఉన్నారు. కల్లూరులో ఉన్న శ్రీనివాసరెడ్డి పగిడ్యాలకు బదిలీ అయ్యారు. కర్నూలు ఏడీ కార్యాలయంలో టెక్నికల్ ఏఓగా ఉన్న దస్తగిరిరెడ్డి గూడూరు ఏఓగా బదిలీ అయ్యారు. కొత్తాళం ఏవో శేషాద్రి అనంతపురం జిల్లా ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. ఆదోని ఏవో అశోక్‌కుమార్‌రెడ్డి తంగడంచె ఫామ్‌కు బదిలీ అయ్యారు. ఆదోని ఏఓ పోస్టుకు విశ్వప్రయత్నాలు చేసిన ఓర్వకల్ ఏఓ సుధాకర్ ఎమ్మిగనూరు ఫామ్‌కు బదిలీ అయ్యారు. ఓర్వకల్ ఏఓగా మధుమతి, అవుకు ఏఓగా కళిమున్నీసా, బండిఆత్మకూరు ఏవోగా హేమలత, కొత్తాళం ఏవోగా విజయజ్యోతి కుమార్ నియమితులయ్యారు.

**వ్యవసాయ శాఖలో 12 మంది ఏడీఏల బదిలీ**

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖలో 12 మంది ఏడీఏలు బదిలీ అయ్యారు. ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత ఎమ్మిగనూరు ఫామ్‌కు బదిలీ అయ్యారు.

ఏడీఏ బదిలీల వివరాలు

| ఏడీఏపేరు | ప్రస్తుతం స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| రాజశేఖర్ | నంద్యాల | అగ్రానమీ కర్నూలు డీఏవో ఆఫీసు |
| అశోక్‌వర్ధన్‌రెడ్డి | డోన్ | ఎమ్మిగనూరు ఎస్‌టీఎల్ |
| సునీత | ఆలూరు | డోన్ |
| అరుణకుమారి | ఆదోని | కర్నూలు డీఆర్‌సీ |
| చెంగల్రాయుడు | అనంతపురం జిల్లా | ఆలూరు |
| బాలవర్ధిరాజు | కర్నూలు అగ్రానమీ | ఆదోని |
| మద్దిలేటి | కర్నూలు డీఆర్‌సీ | రాయచోటి |
| శైలకుమారి | ఎమ్మిగనూరు సీడ్‌టెస్టింగ్ ల్యాబ్ | చిత్తూరు డీఆర్‌సీ |
| అన్నపూర్ణ | పలమనేరు | ఎమ్మిగనూరు సీడ్ టెస్టింగ్ ల్యాబ్ |
| గిరీష్ | డీఆర్‌సీ కర్నూలు | నంద్యాల |
| సుధాకర్ | డీఆర్‌సీ నంద్యాల | కోవెలకుంట్ల |

### ఎక్సైజ్ శాఖలో రిక్వెస్ట్ బదిలీలు

కర్నూలు: జిల్లా ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు స్థానచలనం కలిగింది. కుటుంబ సభ్యుల అనారోగ్యం, ఉద్యోగ రీత్యా దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యల దృష్ట్యా ఉన్నతాధికారులకు విన్నవించుకోవడంతో (రిక్వెస్ట్) ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, ఏడుగురు కానిస్టేబుళ్లను ప్రస్తుతం ఉన్న స్థానం నుంచి మరో స్థానానికి బదిలీ చేస్తూ ఆ శాఖ జిల్లా అధికారి సుధీర్ బాబు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో కొంతమందిపై అవినీతి ఆరోపణలు కూడా ఉన్నట్లు ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది.

### జిల్లా ట్రెజరీ ఏటీఓ బదిలీ

● పలువురు ఎస్‌టీఓలకు స్థానచలనం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీ కార్యాలయంలో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్(ఏటీఓ) జయలక్ష్మిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ ఏటీఓగా ఐదేళ్లకు పైగా పని చేస్తుండటంతో ఈమెను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేస్తూ రాష్ట్ర ట్రెజరీ, అకౌంట్స్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న పలువురు సబ్ ట్రెజరీ అధికారులకు కూడా స్థానచలనం కలిగింది.

| పేరు | ప్రస్తుతంస్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| ఏబీఎస్ ప్రసాద్ | నంద్యాల సబ్‌ట్రెజరీ | నంద్యాల జిల్లా ట్రెజరీ |
| ఎం.రాజు | ఎమ్మిగనూరు | నందికొట్కూరు |
| ఎం.కె.రఘునందన్ | డోన్ | ఎమ్మిగనూరు |
| అంజాద్ పాషా | జిల్లా ట్రెజరీ, కర్నూలు | కోవెలకుంట్ల |
| పి.సునిల్ కుమార్ | జిల్లా ట్రెజరీ, కర్నూలు | డోన్ |
| జె. శ్రీనివాసులు | జిల్లా ట్రెజరీ, కర్నూలు | ఆదోని |
| టి.ఎం.చెన్నయ్య | ఆదోని | నంద్యాల |
| కె.సురేష్ | కోవెలకుంట్ల | బద్వేల్ |
| వై.ఎస్.వి.ప్రసాద్ | పుట్టపర్తి | కర్నూలు |
| మధుసూదన్ రావు | పుట్టపర్తి | నంద్యాల |
| వరలక్ష్మి | నంద్యాల | కర్నూలు |
| హేమచంద్రారావు | నంద్యాల | కర్నూలు |
| షబానా | నందికొట్కూరు | గుంతకల్లు |